## ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి



సూర్య నమస్కారం వేస్తున్న యువకులు

లింగంపేట, మే 8 : ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని ప్రారంభ కార్యవాహ మారుతిరావు సూచించారు. లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన శిక్షవర్గ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ శాఖకు వెళ్లిన యువకుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. దేశ భక్తి, మానవతా విలువలు, క్రమ శిక్షణ, జాతీయ భావం పెంచించుకోవచ్చని అ న్నారు. మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులకు సూర్య నమస్కారాలతోపాటు వ్యాయామలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలి

బాన్సువాడ, మే 8 : పట్టణంలోని 19 వార్డుల్లో వార్డు అధికారులు లబ్ధిదారుల ఎంపికను కమిటీ సభ్యులతో కలిసి సమన్వయంతో ఎంపికను చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు రెండో వార్డులో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను గురువారం పరిశీలించారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట వార్డు అధికారులు తుల శ్రీనివాస్, కమిటీ సభ్యులు, మాజీ కౌన్సిలర్ మోతిరామ్, లింగం తదితరులు ఉన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



దోమకొండలో రైతుల వివరాలను నమోదు చేస్తున్న ఏవో మణిదీపిక

బీబీపేట్, మే 8 : దోమకొండ మండలంలోని రైతులు రైతు వేదికల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నట్లు ఏవో మణిదీపిక గురువారం తెలిపారు. దోమకొండలోని రైతువేదికలో రైతుకు ఏవో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికీ గుర్తింపు ఇచ్చినట్లుగానే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియతో భూమి ఉన్న ప్రతి రైతుకూ 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్రం అనుసంధానంతో ఈ ప్రక్రియను వ్యవసాయశాఖ ప్రాంరభించినట్లు తెలిపారు. రైతులందరూ ఆధార్ కార్డుకు లింక్ ఉన్న మొబైల్ ఫోన్, ఆధార్ కార్డు, పట్టాపాసుపుస్తకం తీసుకొని ఏఈవోలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాడుతున్న ఆరుగురు పట్టివేత

కామారెడ్డి, మే 8 : జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీ శివారులో గురువారం కొంత మంది వ్యక్తులు పేకాడుతున్నారని సమాచారం అందడంతో ఎస్సై శ్రీరాం, సిబ్బంది దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వీరి నుంచి పేక ముక్కలు, రూ.6,200 నగదు, నాలుగు మోటర్ సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాదల్ సింగ్, విష్ణుసింగ్, మంజిత్ సింగ్, చందన్ సింగ్, అర్జున్ సింగ్, సమయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలి

### కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి,మే 8 : మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ వెనుక భాగంలో నిర్మిస్తున్న మహిళా శక్తి భవన నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం పరిశీలించారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు ఐదు కోట్ల రూపాయలతో పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. సాధారణ తనిఖీలో భాగంగా ఈవీఎం గోదామును పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, పంచాయతీ రాజ్ ఈఈ దుర్గాప్రసాద్, ఇతర ఇంజినీర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, నాయబ్ తహసీల్దార్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో కొనసాగుతున్న విచారణ



శెట్పల్లి గ్రామంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఆర్డీవో

లింగంపేట, మే 8 : లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో భూభారతి చట్టంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపడుతున్నారు. లింగంపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా రెవెన్యూ అధికారులు గ్రామాల్లో విచారణ చేపడుతున్నారు. రైతులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం తదితర అంశాలపై విచారణ చేపడుతున్నారు. మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి, ముంబాజీపేట గ్రామాల్లో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గురువారం పర్యటించారు. శెట్పల్లి గ్రామంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ పర్యటించి విచారణ పరిశీలించారు. వీరి వెంట రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## తాడ్వాయి ఎస్సైగా మురళి



మురళి, ఎస్సై

లింగంపేట, మే 8 : తాడ్వాయి మండల ఎస్సైగా మురళి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన ఎస్సై వెంకటేశ్వర్లు విధుల్లో నిర్లక్ష్యం వహించడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, అవినీతి ఆరోపణల కారణంగా ఉన్నతాధికారులు సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న రాజయ్యకు ఎస్‌హెచ్‌వోగా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ఆయన స్థానంలో మురళిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



గండిమాసానిపేట్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రేమ్‌కుమార్



నిజాంసాగర్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భిక్షపతి

ఎల్లారెడ్డి రూరల్, మే 8 : నత్తనడకన నడుస్తున్న ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. ఎల్లారెడ్డి మండల గండిమాసానిపేట్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఇప్పటివరకు 21 లారీల ధాన్యం మాత్రమే తూకమై లారీల్లో తరలించినట్లు తెలిపారు. మిగతా ధాన్యాన్ని కూడా త్వరితగతిన తూకం వేసి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. తూకమైన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడూ నమోదు చేయాలన్నారు. ఆయనతోపాటు గిర్దావర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

**కొనుగోలు కేంద్రం పరిశీలన**

నిజాంసాగర్, మే 8 : నిజాంసాగర్ మండలంలోని మల్లూర్, మల్లూర్ తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ భిక్షపతి గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న సమస్యలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను త్వరగా లారీల్లో రైస్ మిల్లుకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాల్లో ఉన్న ధాన్యం మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## యూనిఫామ్స్ పంపిణీ



అడ్లూర్ యెల్లారెడ్డిలో జీపీ సిబ్బందికి యూనిఫామ్స్ అందజేస్తున్న దృశ్యం

రామారెడ్డి (సదాశివనగర్) మే 8 : సదాశివనగర్ మండలం అడ్లూర్ యెల్లారెడ్డి గ్రామ పంచాయతీ సిబ్బందికి కామారెడ్డి డీఎల్పీవో వెంకటశ్రీనివాస్, మండల పంచాయతీ ఆఫీసర్ సురేందర్‌రెడ్డి కలిసి గురువారం యూనిఫామ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేయాలి



మాజీ మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న కామారెడ్డి విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి సభ్యులు

కామారెడ్డి, మే 8 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీ అమలుకు కృషి చేయాలని కోరుతూ.. కామారెడ్డి విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును గురువారం సేవా సమితి సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. హరీశ్‌రావు సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి దివ్యాంగుల సంక్షేమ కోసం మాట్లాడుతానని అన్నారని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు చిప్ప దుర్గాప్రసాద్, సబ్ వైస్ చైర్మన్ నితీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఒక రోజు సమ్మర్ క్యాంపు

కామారెడ్డి, మే 8 : జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఓం శాంతి పార్కులో ఒక రోజు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు జయదీదీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన బాలురు 7 నుంచి 12 ఏండ్లలోపు, 11వ తేదీన బాలికలు 13 నుంచి 19 ఏండ్లలోపు వారికి ఒక రోజు సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారులకు సభ్యత, సంస్కృతి, సంస్కారం, పిల్లల భవిష్యత్తు తదితర అంశాలపై క్యాంపులో వివరించనున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. చిన్నారులకు మధ్యాహ్నం లంచ్, సాయంత్రం స్నాక్స్ ఇస్తామని, ఆసక్తి ఉన్నవారు 9912916539 నంబర్‌కు చిన్నారుల పూర్తి బయోడేటాను పంపించాలని సూచించారు.

## నేడు మెగా రక్తదాన శిబిరం

రామారెడ్డి, మే 8 : అంతరాతీయ నర్సెస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కామారెడ్డి శాఖ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కామారెడ్డి నర్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మమత, జనరల్ సెక్రెటరీ కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రాణదాతలు కాగలరని సభ్యులు కోరారు.

## దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం




ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఎల్లారెడ్డి రూరల్, మే 8: దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ నెల 21వ తేదీలోగా డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కోరుకున్న గ్రూపులు, కోర్సుల కోసం వెబ్ ఆప్షన్ ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవాలన్నారు. పిన్ నంబర్ ఇతరులకు చెప్పవద్దన్నారు. ఈ నెల 29వ తేదీన మొదటి దశ సీట్ల కేటాయింపు చేస్తారని, ఎక్కడ సీటు వచ్చింది ఫోన్ ద్వారా మెస్సేజ్ వస్తుందన్నారు. దాని ఆధారంగా విద్యార్థులు కళాశాలలలో ప్రవేశం పొందవచ్చన్నారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్థానిక విద్యార్థులకు అనుగుణమైన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఏలో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బీకాం వారికి కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ వారికి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో చదవవచ్చన్నారు. ఎల్లారెడ్డి కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, బాలురు, బాలికలకు విడివిడిగా వసతిగృహం సౌకర్యం ఉందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో అధునాతనమైన సౌకర్యాలతో ప్రయోగశాలలు, డిజిటల్ లైబ్రరీ సదుపాయం ఉందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన, స్కాలర్‌షిప్, బస్‌పాస్, ఎన్ఎస్ఎస్ వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9440759198, 9989538243, 9951281286 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భిక్కనూరు, మే 8 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 2003–2004 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ (ఆర్మీ), నిజామాబాద్ జిల్లా గురుకుల మాజీ రీజినల్ ఫిజికల్ డైరెక్టర్ నర్సింగ్ రావు ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఉదయ్ భాస్కర్, జూనియర్ లెక్చరర్లు నగేశ్, రమేశ్, విజయ్, రామచంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు నిందితుల రిమాండ్

లింగంపేట్, మే 8 : లింగంపేట్ మండలం మాలోత్‌తండాకు చెందిన రవి ముంబోజీపేట్ తండాకు చెందిన గుగులోత్ సురేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. వీరిరువురిపై గతంలో కేసులు నమోదై ఉన్నట్లు ఎస్సై తెలిపారు. ఇద్దరు నిందితులు కోర్టుకు హాజరుకానందున ఎస్పీ ఆదేశాల మేరకు నాన్‌బెయిలబుల్ జారీ అయినట్లు ఎస్సై తెలిపారు. ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## ‘మీకు అండగా మేమున్నాం’

ఎల్లారెడ్డి రూరల్, మే 8 : దేశ రక్షణ కోసం నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉన్న సైనికులకు మనోధైర్యం కల్పించేలా మీకు అండగా మేమున్నాం అంటూ స్థానిక నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీచౌక్ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ‘ఆపరేషన్ సిందూర్’కు సంఘీభావ గురువారం ర్యాలీ నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సందేశం మేరకు ర్యాలీ నిర్వహించామని వారు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, స్థానిక నాయకులు ఉన్నారు.



ఎల్లారెడ్డిలో ర్యాలీ తీస్తున్న స్థానిక నాయకులు

## ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

నిజాంసాగర్, మే 8 : మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జాతరలో భాగంగా బుధవారం బోనాలు, రథోత్సవం నిర్వహించారు. కుస్తీ పోటీల్లో చివరి విజేతలకు రూ.3 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా వ్యాధిపై అవగాహన

రామారెడ్డి(సదాశివనగర్), మే 8 : సదాశివనగర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక దవాఖానలో తలసేమియా దినోత్సవ అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆస్మా తెలిపారు. తలసేమియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బధిరుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, మే 8 : 2025–26 విద్యాసంవత్సరానికి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కమల ఉదయ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో, ఒకటి నుంచి పదోతరగతి వరకు తెలుగు మాధ్యమంలో ప్రవేశాలు కల్పించనుండగా, 6 నుంచి 14 ఏండ్లలోపు బధిర బాల, బాలికలు మాత్రమే అర్హులని వెల్లడించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లోని బాలబాలికలకు మాత్రమే ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వసతి గృహ సౌకర్యం, పాఠ్య, నోటు పుస్తకాలు, స్కూలు యూనిఫామ్‌తో పాటు భోజనం, విద్య ఉచితంగా అందజేయనున్నట్లు స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, టీసీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదురుగా ఉన్న విజయపురికాలనీలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 9000013639 నెంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

## ఉచితాలకు ఆశ పడొద్దు




ఎల్లారెడ్డిలో అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాత బృందం

లింగంపేట, మే 8 : గుర్తు తెలియని వ్యక్తులు లాటరీలో డబ్బులు వచ్చాయని ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నందునా ఉచితాలపై ఆశ పడొద్దని పోలీస్ కళాబృందం సభ్యులు సూచించారు. లింగంపేటలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కళా ప్రదర్శన నిర్వహించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన సమయంలో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అత్యవసర సమయాల్లో 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

**సైబర్ మోసానికి గురైతే 1930కి కాల్ చేయాలి**

ఎల్లారెడ్డి రూరల్, మే 8 : గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి వ్యక్తిగత సమాచారాన్ని, ఓటీపీని అడిగితే చెప్పవద్దని, ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసు కళాజాత బృందం సభ్యులు సూచించారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఎస్బీఐ బ్యాంకులో వినియోగదారులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎస్బీఐ బ్యాంకు సిబ్బంది, పోలీసు కళాజాత బృందం సభ్యులు, ఎల్లారెడ్డి పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

## మండల సమాఖ్య కార్యాలయంలో ఆడిట్



నాగిరెడ్డిపేట్ మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆడిట్

ఎల్లారెడ్డి రూరల్(నాగిరెడ్డిపేట్), మే 8 : నాగిరెడ్డిపేట్ మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం గ్రామ సంఘాలు, మండల సమాఖ్య ఆడిట్‌ను నిర్వహించినట్లు ఏపీఎం జగదీశ్‌కుమార్ తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లెక్కల ఆడిట్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దీనిలో గ్రామ సమస్యలు, మండల సమాఖ్య గత ఆర్థిక సంవత్సర లావాదేవీలు తదితర అంశాలను ఆడిట్ బృంద సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. ఆడిట్ నివేదికలను 10 రోజుల్లో జిల్లా కార్యాలయానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆడిట్ బృందం సభ్యులు అశోక్‌రెడ్డి, శివ, రాజేశ్. మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, వివిధ గ్రామ సంఘాల అధ్యక్షులు, సీసీలు, మండల సమాఖ్య సిబ్బంది, వీవోఏలు తదితరులున్నారు.

## వాలీబాల్‌పై శిక్షణ



వాలీబాల్‌లో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

లింగంపేట, మే 8 : మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో వాలీబాల్ క్రీడపై మెళకువలు నేర్పుతున్నట్లు మండల విద్యాశాఖ అధికారి షౌకత్ అలీ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు వాలీబాల్, కబడ్డీ, చిత్ర లేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, యోగా తదితర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు వందకు పైగా విద్యార్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## యువతి అదృశ్యం

రామారెడ్డి, ఏప్రిల్ 8 : మండల కేంద్రంలో యువతి అదృశ్యమైనట్లు రామారెడ్డి ప్రొబెషనరీ ఎస్సై నవీన్‌చంద్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బిట్ల కీర్తన తల్లి పనికి వెళ్లడంతో ఇంటి వద్దనే ఉన్నది. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఆమె సోదరుడు రాజ్‌కుమార్‌కు ఉదయం 11 గంటలకు ఫోన్ చేసి గ్రామంలోని మీ సేవకు వెళ్తున్నట్లు చెప్పింది. తల్లి రేణుక పని నుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికి కూతురు ఇంట్లో లేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పిల్లలకు సెల్‌ఫోన్ అలవాటు చేయవద్దు

ఎల్లారెడ్డి రూరల్, మే 8: అన్నం తినకున్నా, అల్లరి చేసిన పిల్లలకు మనమే సెల్‌ఫోన్‌లు ఇచ్చి అలవాటు చేస్తున్నామని, ఇది పిల్లల దృష్టిపై ఎంతో ప్రభావాన్ని చూపుతుందని ఆప్తాలమిస్ట్ హరికిషన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి మండలం మౌలాన్‌ఖేడ్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో 42 మంది చిన్న పిల్లలకు గురువారం కంటి పరీక్షలను నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు పలు సూచనలు, జాగ్రత్తలను వివరించారు. ప్రతి రోజు కండ్లను జాగ్రత్తగా కడుక్కోవాలని, సెల్‌ఫోన్‌ను ఏమాత్రం పిల్లలకు ఇవ్వొద్దన్నారు. విటమిన్లు ఉండే ఆకుకూరలను తినిపించాలని, పాలను తాగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ సంజయ్‌కుమార్, ఫార్మాసిస్ట్ రవితేజ, ఏఎన్ఎం సునీత, అంగన్‌వాడీ టీచర్ తదితరులున్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమిపూజ



వెల్లుట్లలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మే 8 : ఎల్లారెడ్డి మండలం వెల్లుట్ల గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ముదిరాజ్ కులదైవమైన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు, దాతలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట సాయిలు, దాసరి అంజయ్య, చీకుల రాములు, నర్వ శంకర్, బైండ్ల గోపాల్, సాయిలు, కృష్ణ, గంగాధర్, శ్రీకాంత్, సాయిలు, సంతోష్ తదితరులున్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బీబీపేట్, మే 8 : బీబీపేట, దోమకొండ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలు, మసీద్, చర్చీల్లో సీసీ కెమోరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సైలు ప్రభాకర్, స్రవంతి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. దోమకొండ, బీబీపేట పరిధిలోని అన్ని ఆలయాల కమిటీ ప్రతినిధులు ఆలయాల్లో సీసీ కెమోరాలను ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు. ఆలయాలు, మసీదులు, చర్చిల్లో భద్రతపై పలు సూచనలు చేశారు.

## బంగారు ఆభరణాలు చోరీ

కామారెడ్డి, మే 8 : బస్సు కోసం బస్టాండ్‌లో వేచి చూస్తున్న ప్రయాణికురాలి హ్యాండ్ బ్యాగ్ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలను చోరీ చేసిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మైలారం గ్రామానికి చెందిన సుధేష్ట అనే మహిళ హైదరాబాద్ నుంచి కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో దిగింది. అక్కడి నుంచి భీమ్‌గల్ వెళ్లే బస్సు ఎక్కేందుకు వేచి ఉంది. సాయంత్రం 5.40 గంటలకు భీమ్‌గల్ వెళ్లే బస్సు ఎక్కిన తర్వాత ఆమె చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను పరిశీలించగా బ్యాగు జిప్పు ఓపెన్ చేసిఉంది. అందులో ఉన్న ఎనిమిది తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.